క్లుప్తంగా

ఎస్పీని కలిసిన ఆదిమూలపు సురేష్



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: ఎస్పీ హర్షవర్ధన్‌రాజును మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను శనివారం ఒంగోలులోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. తరువాత ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కొండపి నియోజకవర్గంలో పలు సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి చర్చించారు.

స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కనిగిరిరూరల్: దివ్యాంగురాలి స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ధూళిపాళ్ల మల్లికార్జునరావు శనివారం డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు మల్లికార్జునరావు బాధితులతో కలిసి డీఎస్పీకి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ దివ్యాంగురాలైన(అంధురాలు) ఛీయాద్రి బుజ్జికి 2012లో సర్వే నెంబర్ 895, 899లో 75వ ప్లాట్ నెంబర్‌తో ఇంటి పట్టా ఇచ్చారన్నారు. ఆమెకు ఇచ్చిన ఇంటి పట్టా స్థలాన్ని చల్లగిరిగిల్లకు చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమించి ఇళ్లు నిర్మించుకుంటున్నారని ఆయన ఆరోపించారు. దివ్యాంగురాలైనా బుజ్జికి చెందిన ప్లాట్‌ను దొంగ వేలిముద్రలతో కొందరు ఫోర్జరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దివ్యాంగుల పట్టాలను ఫోర్జరీ సంతకాలు, వేలిముద్రలతో అమ్మకాలు చేస్తున్న వారిపై వికలాంగుల హక్కుల చట్టం 2016 సెక్షన్ 92ఏ కింద క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆయన పేర్కొన్నారు.

సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన సీఐ

కనిగిరిరూరల్: స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్‌లో టెన్నిస్ ఆడుతున్న కనిగిరి పీఏసీఎస్ అధ్యక్షుడు అద్దంకి రంగబాబు శనివారం కళ్లు తిరిగి కింద పడిపోయారు. అదే కోర్టులో టెన్నిస్ ఆడుతున్న కనిగిరి సీఐ ఎస్‌కే ఖాజావలి వెంటనే స్పందించారు. రంగబాబు పరిస్థితిని గమనించి వెంటనే సీపీఆర్ చేశారు. దీంతో ప్రాణాపాయం తప్పింది. తక్షణం వెంటనే కాస్మోపాలిటన్ క్లబ్ సభ్యులు, టెన్నిస్ క్రీడాకారులంతా కలిసి సమీపంలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సరైన సమయంలో ప్రాథమిక చికిత్స అందించడంతో పాటు, ఆస్పత్రికి తీసుకుని రావడం వల్ల పెను ప్రమాదం తప్పిందని వైద్యులు ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కల్గి ఉండాలన్నారు. ఈ సందర్భంగా సీఐ ఎస్‌కే ఖాజావలి మాట్లాడుతూ త్వరలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తానని తెలిపారు. ప్రాణాప్రాయ స్థితిలో ఉన్నవారికి సీపీఆర్ చేయడం వల్ల మేలు జరుగుతుందని వివరించారు.

వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలి

కనిగిరిరూరల్: వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆర్ ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు నిర్వాసితులకు తక్షణం రూ.1002 కోట్ల ప్రత్యేక గ్రాంట్ విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దిష్టమైన కేటాయింపులు చేయడం లేదని విమర్శించారు. అలాంటప్పుడు 2026 సెప్టెంబర్‌కు నీళ్లు ఇస్తామన్న ప్రభుత్వ హామీ ఎలా నెరవేరుతుందని ప్రశ్నించారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు నత్తనడకన జరుగుతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో పీపీ కేశవరావు, నరేంద్ర, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తత అవసరం



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

హనుమంతునిపాడు: సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కె.మాధవరావు అన్నారు. మండల కేంద్రంలో సైబర్‌నేరాలు, రోడ్డు ప్రమాదాలు, అపరచిత వ్యక్తుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం రాత్రి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకు ఖాతా నంబర్లు అడిగినా, ఓటీపీ అడిగినా చెప్పొద్దని సూచించారు. అటువంటి వ్యక్తుల ఫోన్‌నంబర్లు పోలీసులకు ఇవ్వాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. రాత్రిళ్లు మద్యం తాగి వీధుల్లో, రోడ్లపై అలజడి సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రిళ్లు కొత్త వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



30వ మైలువద్ద గుంతలమయంగా ఉన్న తూర్పు కట్టకిందపల్లె రోడ్డు



గుంతల మయంగా ఉన్న తూర్పు కట్టకిందపల్లె, కరోళ్లపాడు రోడ్డు



కట్టకిందపల్లె సమీపంలో గుంతలమయంగా రోడ్డు

అడుగుకో గుంత.. ఎన్నాళ్లీ చింత..!

- అధ్వానంగా గ్రామాలకు వెళ్లే రోడ్లు
- కనీస మరమ్మతులు పట్టని కూటమి ప్రభుత్వం
- వాహనదారులు తప్పని ఇక్కట్లు..



శ్మశానం సమీపంలో గుంతలతో సీఎస్‌పురం రోడ్డు

పామూరు:

పామూరు నుంచి మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయమయ్యాయి. అటు పాదచారులు, ఇటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పామూరు నుంచి కందుకూరు రోడ్డు 167బీ జాతీయ రహదారి బైపాస్ కనెక్టివిటీ రోడ్డు సీహెచ్‌సీ సమీపంలో గుంతలమయంగా ఉంది. అదే విధంగా ఈరోడ్డు కొంతదూరం సింగిల్‌రోడ్డు కావడం, ఉన్నరోడ్డు సైడుమార్జిన్లు కూడా గుంతలమయంగా ఉండటంతో వాహనదారులు పడే ఇక్కట్లు అన్నీ ఇన్నీకావు. మండలంలో పంచాయతీరాజ్ రోడ్లు గోతులమయంగా అడుగుకో గుంత ఉండటంతో ఏ క్షణంలో ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందో అన్న చందాన గుంతలతో నిండి ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పామూరు నుంచి తూర్పుకోడిగుడ్లపాడు వెళ్లే రోడ్డు పలుచోట్ల గుంతలమయంగా ఉంది. మండలంలోని 30వ మైలు వద్ద నుంచి తూర్పు కట్టకిందపల్లె, కరోళ్లపాడు వెళ్లే పంచాయతీరాజ్‌కు చెందిన రోడ్డు గోతులమయంగా ఉంది. ఈ రోడ్డులో నిత్యం వందల సంఖ్యలో ఆటోలు, ద్విచక్రవాహనాలు, ఉదయం, సాయంత్రం విద్యార్థులతో వచ్చే పాఠశాల వాహనాలు, పాదచారులు గుంతలతో ఉన్న రోడ్లపై ప్రయాణం చేయలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈరోడ్డు గుండా ప్రతిరోజు విద్యార్థులు హైస్కూల్, జూనియర్, డిగ్రీ, బీఈడీ, డైట్ కళాశాలలకు పామూరుకు బైక్, ఆటో, వ్యాన్‌లలో రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు గుంతలతో ప్రయాణం నరకయాతనగా మారుతోందని పడమటి కట్టకిందపల్లె, కరోళ్లపాడు గ్రామాలకు చెందిన వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పామూరు నుంచి నెల్లూరు వెళ్లేందుకు ఈ రోడ్డుగుండా ప్రయాణంచేస్తే 10 కిలోమీటర్లు దూరం తగ్గుతుండగా పలువురు వాహనదారులు ఈరోడ్డుగుండా రాకపోకలు సాగిస్తుంటారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 17 నెలలైనా నేటికి అధ్వాద్వాన్నంగా ఉన్న గుంతల రోడ్లకు కనీసం మరమ్మతులు చేపట్టి ప్రజల కష్టాలు తీర్చలేకపోవడం విడ్డూరంగా ఉంది. పాలకులు, అధికారులు తక్షణం యుద్ధ ప్రాతిపదికన రోడ్ల మరమ్మతులు చేసి తమ కష్టాలు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గుంతలతో ఉన్న తూర్పు కోడిగుడ్లపాడు రోడ్డు

రోడ్లుకు మరమ్మతులు చేయాలి:



పామూరు నుంచి కందుకూరురోడ్డు వైపు 167బీ జాతీయ రహదారివరకు రోడ్డు సరిగా లేదు. గుంతలు, రోడ్డు మార్జిన్లు సరిగా లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కట్టకిందపల్లె, కరోళ్లపాడు, తూర్పుకోడిగుడ్లపాడు రోడ్లకు తక్షణం నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణాలు ప్రారంభించాలి.

టి.ఆంజనేయులు

వైఎస్సార్ సీపీ శ్రేణులకు అండగా డిజిటల్ బుక్

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ఆదిమూలపు సురేష్

టంగుటూరు: కూటమి ప్రభుత్వంలో అక్రమ కేసులు బనాయిస్తూ అరాచక పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ధ్వజమెత్తారు. పార్టీ శ్రేణులకు అండగా ఉండేందుకే డిజిటల్ బుక్‌ను ప్రవేశపెట్టారని చెప్పారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు ఆధ్వర్యంలో నాయకులతో కలిసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ, గ్రామ అనుబంధ విభాగ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ అరాచకాలకు పాల్పడే కూటమి పార్టీ నాయకులకు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. చంద్రబాబు సంక్షేమం, అభివృద్ధి మరిచి కక్ష సాధింపు రాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు. ఈ 15 నెలల కూటమి ప్రభుత్వ అరాచక పాలనలో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులు, తమ ప్రభుత్వంలో పనిచేసిన నాటి అధికారులపైనా అక్రమ కేసులు పెడుతూ అనాగరికంగా వ్యవహరించారన్నారు. ఇదే తరహాలో స్థానిక మంత్రి మర్లపాడు నాయకులపై అక్రమ కేసు పెట్టి జైలు పాలు చేశాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో మేదరమిట్ల భరత్‌రెడ్డి, ఏలూరి వంశీ, తక్కిలపాటి సుధాకర్, వలివర్తి శ్రీనివాసరాజు, కొండపి నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు పరిటాల సునీల్, పేరూరి కమలాకర్, కొమ్ము సురేంద్ర, దేవరపల్లి వరుణ్, శ్రీపతి విజయ్, దావులూరి సునీల్, పందిటి అశోక్, తదితర నాయకులు పాల్గొన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న ఆదిమూలపు సురేష్

పాస్టర్ ప్రకాశంకు జీజీహెచ్‌లో చికిత్స

ఒంగోలు టౌన్: కనిగిరి మండలం మాచవరం గ్రామానికి చెందిన చర్చి పాస్టర్ కుడుముల ప్రకాశం ఒంగోలు జీజీహెచ్‌లో అపస్మారకస్థితిలో చికిత్స పొందుతున్నారు. గత ఆగస్టు 5వ తేదీ ఆయనపై గ్రామంలో దాడి జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పటి నుంచి ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడని, శనివారం ఒంగోలులో ఉన్నట్లు తెలిసి తామంతా వచ్చామని ఆయన సోదరి అలీషమ్మ తెలిపారు. అయితే, ఆయనకు ఆరోగ్యం బాగాలేదని చెప్పడంతో ఆస్పత్రికి తీసుకెళ్తుండగానే అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయారని కన్నీరు పెట్టుకున్నారు. ప్రస్తుతం జీజీహెచ్‌లోని ఐసీయూలో ఆయన చికిత్స పొందుతున్నారు. తన సోదరుడికి ప్రాణభిక్ష పెట్టాలని అలీషమ్మ వేడుకుంటున్నారు. మాచవరంలో కొంతమంది వ్యక్తులు ఆయనను హతమార్చేందుకు ప్రయత్నిస్తున్నారని, వారి నుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా పాస్టర్ ప్రకాశం విడుదల చేసిన ఒక వీడియో సోషల్ మీడియాలో ట్రోల్ అవుతోంది. తనపై దాడి చేసి నోట్లో మూత్రం పోశారని ఆ వీడియోలో ఆయన ఆరోపించడం సంచలనం సృష్టిస్తోంది.



జీజీహెచ్ ఐసీయూలో అపస్మారకస్థితిలో చికిత్స పొందుతున్న పాస్టర్ ప్రకాశం

బింగినపల్లి చెరువును కాపాడండి

సింగరాయకొండ: బింగినపల్లి చెరువులో ఇష్టారాజ్యంగా మట్టి, ఇసుక తవ్వకాలు చేస్తున్నారని, దీంతో చెరువు కట్టల భద్రతకు ముప్పు వాటిల్లుతుందని వైస్ ఎంపీపీ ఎస్ రవికుమార్‌రెడ్డి, పాకల-1 ఎంపీటీసీ జి.అశోక్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ కట్టా శోభారాణి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. వైస్ ఎంపీపీ రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ బింగినపల్లి చెరువు కింద సుమారు 2 వేల ఎకరాల ఆయకట్టు ఉందని, ఆ చెరువులో అక్రమ తవ్వకాలతో చెరువు కట్టలు ప్రశ్నార్థకంగా మారాయని, ఇంత జరుగుతున్నా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు అక్రమ తవ్వకాలను అడ్డుకోకుండా చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. చెరువు కట్ట పక్కనే రక్షిత మంచినీటి పథకాలు ఉన్నాయని, వాటి పరిస్థితి కూడా ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు అధ్వాన్నంగా ఉన్నాయని, దీంతో దోమల బెడద ఎక్కువై ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆరోపించారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారి గుంతలమయమై ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని ముందస్తు చర్యల్లో భాగంగా గుంతలు పూడ్చాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీటీసీ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సింగరాయకొండ- పాకల రోడ్డు అధ్వాన్నంగా ఉందని తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పాకల- ఊళ్లపాలెం రహదారి కూడా గుంతలమయంగా ఉందన్నారు. గ్రామంలో పారిశుధ్య అధ్వాన్నంగా ఉందని, రక్షిత మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయడం ఎప్పుడో మరిచారని ప్రజలకు కలుషితనీరు అందిస్తున్నారని సమస్యలు పరిష్కరించాలని కోరారు. సర్వసభ్య సమావేశంలో లేవనెత్తిన ఒక్క సమస్య కూడా పరిష్కారం కావడం లేదని, దీంతో సభ్యులు సమావేశానికి రావటానికి కూడా ఆసక్తి చూపటం లేదన్నారు. సీహెచ్‌ఓ పీరయ్య మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు ఎక్కువగా ఉన్నాయని దోమల బెడద కూడా ఎక్కువగా ఉందన్నారు. మురుగుకాల్వలో నీరు నిల్వ ఉండకుండా గ్రామ పంచాయతీ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన శాఖలైన అగ్రికల్చరల్, ఉపాధి హామీ పథకం, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఎక్సైజ్ అధికారులు రాకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీడీఓ డి.జయమణి మాట్లాడుతూ సమావేశానికి హాజరు కాని అధికారులకు నోటీసులు జారీచేస్తామన్నారు. ఎంపీటీసీలు అడిగిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యలు పరిష్కరిస్తానని వివరించారు. ఎంపీటీసీ సోమిశెట్టి వాసవీదేవి, షేక్ షకీల, ఏపూరి శ్రీనివాసులు, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రవికుమార్‌రెడ్డి

విద్యతోనే బాల్య వివాహాల నిర్మూలన



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ ఆశాబేగం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

సీఎస్‌పురం(పామూరు): బాలికా విద్యతోనే పూర్తి స్థాయిలో బాల్య వివాహాల నిర్మూలన సాధ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ షేక్.ఆశాబేగం, ఎంపీటీసీ డాక్టర్ బొమ్మన బోయిన వెంగయ్య అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని చెర్లోపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బాలికా దినోత్సవ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే బాలికలు నూరుశాతం విద్యావంతులు కావాలన్నారు. చిన్న వయసులో వివాహాలు చేయడంవల్ల వారు శారీరక, మానసిక, ఆర్థిక, సామాజిక విషయాల్లో స్వేచ్ఛను కోల్పోతారన్నారు. బాలికలు పౌష్టికాహారం ఆవశ్యకతను తెలుసుకుని పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం టాటా ట్రస్ట్ కోఆర్డినేటర్ గోపీ ఆధ్వర్యంలో కళాజాత ద్వారా అవగాహన నిర్వహించారు. ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ గంధం శామ్యూల్, ఆక్టివ్ సూపర్‌వైజర్ రజని, సరళారెడ్డి పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: విద్యతోనే బాలికల సాధికారత, అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ సహకారంతో మండల న్యాయ సేవాధికార సంస్థ, గుడ్ హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని సమీకృత బాలికల వసతి గృహంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వసతి గృహ సంక్షేమ అధికారి కె.చంద్రకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా బాలికలు ఎదుర్కొంటున్న విద్య, పోషకాహారం, బాల్య వివాహాలు, వైద్యం, చట్టపరమైన హక్కులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలికల చట్టాలు, హక్కులు, ఉపాధి అవకాశాల, సమాన విద్య, ఆరోగ్యం తదితర విషయాల గురించి వివరించారు. వసతి గృహ సంక్షేమ అధికారి జయంతి, పారాలీగల్ వలంటీర్లు, సంస్థల ప్రతినిధులు మంద్రు రమేష్, గంధం శ్యామ్యుల్ గెర్షోమ్, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

200 పొగాకు బేళ్లు తిరస్కరణ



టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం జరిగిన వేలంలో 200 పొగాకు బేళ్లను వ్యాపారులు వివిధ కారణాలతో తిరస్కరించారు. పొగాకు ధరల విషయంలో, లో గ్రేడు పొగాకు బేళ్ల, తిరస్కరణ విషయంలో రైతులు ఎన్ని విధాలా రసనలు తెలిపినా అటు పొగాకు బోర్డు అధికారుల్లో ఇటు వ్యాపారుల్లో ప్రభుత్వంలో చలనం కనిపించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిరుకూరపాడు, పంగులూరి వారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1255 బేళ్లను వేలానికి తీసుకురాగా 1055 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.316, కనిష్ట ధర రూ.70, సరాసరి ధర రూ.255.41గా నమోదైంది. వేలంలో 42 కంపెనీలు పాల్గొన్నారు.

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నుంచి 14 రౌండ్ పొగాకు వేలం ప్రారంభమైందని వేలం నిర్వహణ అధికారి సునీల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌కు అనుగుణంగా అన్ని రకాల బేళ్లను తీసుకురావాలని సూచించారు. బేళ్లలో అన్య పదార్థాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శనివారం నిర్వహించిన వేలంలో క్లస్టర్ పరిధిలోని జువ్విగుంట, అయ్యవారిపాలెం, పీరాపురం, జాళ్లపాలెం, తంగెళ్ల గ్రామాలకు చెందిన రైతులు 1410 బేళ్లను వేలానికి తీసుకురాగా 1093 బేళ్లను తీసుకురాగా 317 బేళ్లనుతిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.315, కనిష్ఠ ధర రూ.70, సరాసరి ధర రూ.206.50గా నమోదైంది. వేలంలో 17 కంపెనీలు పాల్గొన్నాయి.



కొండపిలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

మాలకొండ ఆదాయం రూ.13 లక్షలు

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండలో వెలసి ఉన్న మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం శనివారం రూ.13.19 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈవో ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.22,880, తలనీలాలు రూ.43,175, ప్రత్యేక దర్శనం రూ.3,58,900, రూమ్ అద్దెలు రూ.27,780,లడ్డు ప్రసాదాలు రూ.2,56,660, అన్నదానం రూ.5,30,172 ఇతర విరాళాలు కలిపి ఆదాయం రూ.13,19,816 వచ్చినట్లు ఆయన తెలిపారు.

జూనియర్ డాక్టర్లు ఎక్కడ..?

సింగరాయకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు వైద్యం చేసేందుకు నర్సులే దిక్కయ్యారు. ప్రభుత్వ వైద్యులు తమ సమస్యల పరిష్కారం కోసం సుమారు 10 రోజుల నుంచి విధులు బహిష్కరించారు. దీంతో ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పీజీ కోర్సు చదివే జూనియర్ డాక్టర్లను తాత్కాలికంగా నియమించింది. కానీ సదరు డాక్టర్లు విధులకు హాజరు కాకుండా డుమ్మాకొడుతున్నారు. అంతేకాక వీరు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విధులు నిర్వహించి తిరిగి కాలేజీకి వెళ్లాల్సి ఉంది. దీంతో వీరు సాధ్యమైనంతవరకు ఆస్పత్రులకు రాకుండా డుమ్మా కొడుతున్నారు. ఈ ప్రకారం డాక్టర్ రాకపోవటంతో రోగులకు నర్సులే వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ కుర్చీ ఖాళీగా ఉన్న దృశ్యం

మోటార్‌బైక్, ఆటో ఢీ



ఘటనా స్థలంలో కింద పడివున్న క్షతగాత్రుడు



ఘటనా స్థలంలో ఢీకొని ఉన్న బైక్, ఆటో

పామూరు: ఎదురెదురుగా వస్తున్న మోటార్‌బైక్, ఆటో అదుపుతప్పి ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాయ్యాయి. ఈ ఘటన మండలంలోని నుచ్చుపొద వద్ద 167బీ జాతీయ రహదారి జంక్షన్ వద్ద శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బోడవాడకు చెందిన డి.యలమంద మరో వ్యక్తితో కలిసి బైక్‌పై పామూరులో సొంత పని నిమిత్తం వస్తున్నారు. అదే సమయంలో పామూరు నుంచి ఇనిమెర్ల వైపుకు ఆటో వెళ్తుండగా బైక్, ఆటో అదుపుతప్పి ఢీకొన్నాయి. ఘటనలో మోటార్‌సైక్లిస్ట్ యలమందకు ముక్కు, ముఖం, ఛాతి వద్ద గాయాలయ్యాయి. ఆటోలోని ఇద్దరికి మోస్తరు గాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం ఇవ్వగా ఈఎంటీ నాగబాబు, పైలెట్ వేణులు క్షతగ్రాత్రులకు ప్రథమ చికిత్స అందించి డాక్టర్ల సలహా మేరకు ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కందుకూరు డివిజన్
90102 24456
Office mail : sakshiongads@gmail.com